ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 30 జూలై 2024



● మత్స్యసంపదను ఉద్దేస్తున్న 'అలివి' వల
● నీరుగారుతున్న నిషేధం
● కోట్ల రూపాయల సంపదను కొల్లగొడుతున్న ముఠాలు
● మీనమేషాలు లెక్కిస్తున్న మత్స్యశాఖ అధికారులు
● పట్టించుకోని ఫారెస్టు అధికారులు

సోమశిలలో చేపల మాఫియా

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై29: నిషేధాన్ని నీరుగార్చి.. ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా చేపల మాఫియా సోమశిలలో మత్స్యసంపదను కొల్లగొడుతోంది. ఈ మాఫియా కోస్తా ప్రాంతంలో చేపలు పట్టడంలో బాగా అనుభవం కలిగిన వేటగాళ్లను తీసుకువచ్చి సోమశిలలో యథేచ్ఛగా చేపల వేట సాగిస్తున్నారు. చేపలు గుడ్డు, పిల్ల దశలో ఉండే జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషిద్ధం. ఈ సమయంలో వేటాడితే పునరుత్పత్తి ఆగిపోతుంది. ఇదే జరిగితే చేపల వేట పైనే ఆధారపడి జీవించే నిజమైన మత్స్యకారులు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధిస్తుంది. అయినా ఈ రెండు నెలల్లోనూ సోమశిలలో చేపలవేట తో మాఫియా కోట్ల మత్స్య సంపదను కొల్లగొడుతోంది.

వందల సంఖ్యలో వేటగాళ్లు

సోమశిల బ్యాక్‌వాటర్ ప్రాంతంలో వందల సంఖ్యలో వేటగాళ్లు మకాం వేశారు. సోమశిల పొడవునా సుమారు 30 గుంపులు అంటే 300 నుంచి 400 మంది వరకు వేటగాళ్లు అక్కడే గుడారాలు వేసుకుని వేట సాగిస్తున్నట్లు సమాచారం. వీరంతా తూర్పుగోదావరి, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. వీరికి చేపల మాఫియా లక్షల్లో అడ్వాన్సులు ఇచ్చి ఇక్కడికి తీసుకువచ్చి చేపల వేట కొనసాగిస్తున్నారు. దీంతో సోమశిల మత్స్య సంపదకు గండం వాటిల్లిందని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల పాటు నిషేధం ఉన్నా ఆ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో లైసెన్స్ ఉండే మత్స్యకారులు 50 మంది మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. మరి సోమశిలలో వందల మంది ఎందుకు ఉన్నట్లు? పైగా నిషేధ సమయంలో లైసెన్స్ ఉన్నా లేకపోయినా వేట ఉండదు. అయినా ఆ ప్రాంతంలో వేటగాళ్ల సంచారం కనిపిస్తున్నా ఎందుకు వారిని అక్కడి నుంచి పంపించేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోజూ నాలుగు టన్నుల చేపల వేట

ఒక్క సోమశిల వెనుక జలాల్లోనే రోజూ నాలుగు టన్నుల చిన్న, పెద్ద చేపలను వేటాడుతున్నట్లు సమాచారం. ఒక కేజీ రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు. ఈ లెక్కన రోజూ నాలుగు టన్నులు తరలిస్తున్నారంటే సరాసరిన రోజుకు రూ.3లక్షల రూపాయల చేపలు వేటాడుతున్నట్లు చెప్పవచ్చు. సోమశిల గేట్ల వైపు నెల్లూరు జిల్లా వస్తుంది. అక్కడ పూర్తిగా వేట నిషేధించడంతో వెనుక జలాల్లో పెద్ద ఎత్తున వేట సాగిస్తున్నారు. సోమశిలలో వేటాడిన చేపలను కలకత్తా, ఏలూరు, తిరుచూరు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కూడా కొంతమేర విక్రయిస్తున్నారని అంటున్నారు.

అలివి వలతో పిల్ల చేపలు విలవిల

'అలివి' వలతో చేపలవేట నిషేధం. ఈ వలతో వేటాడడంతో చిన్నచేపతో సహా అన్నీ దీనికి చిక్కిపోతాయి. దీంతో మత్స్య సంపద పూర్తిగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో చేపలు పెద్దవి అయ్యేవరకు అలివి వల వేటను మత్స్యశాఖ నిషేధించింది. అయినా సోమశిలలో వేట సాగిస్తున్నట్లు నిజమైన మత్స్యకారులు వాపోతున్నారు. ఎండబెట్టిన చిన్న చేపలను కిలో రూ.150 నుంచి 200 వరకు విజయవాడ ప్రాంతాల్లో విక్రయిస్తారని సమాచారం. ఒక్కోసారి మూడు నుంచి నాలుగు టన్నుల చేపలను తరలిస్తారని అంటున్నారు.

ఫారెస్టు వారి మతలబు ఏమిటో..!

అక్రమ చేపల వేట చేసేవారు, చేయించేవారు రిజర్వ్ ఫారెస్టు నుంచే వేటకు వెళ్లాల్సి ఉంది. రిజర్వ్ ఫారెస్టులో లైసెన్స్ ఉన్న వారు వెళ్తే సరి. అది కూడా నిషేధ సమయంలో చేపలవేటకు లైసెన్స్ ఉన్నవారు కూడా వెళ్లకూడదు. అయినా అడవిలో రాకపోకలు జరుగుతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. కడప జిల్లాలోని గోపవరం, ఒంటిమిట్ట మండలాల్లోని బ్రాహ్మణపల్లె, గట్టుపల్లె, కుడుమలూరు, బెస్తపల్లి ప్రాంతాల్లోనూ.. అన్నమయ్య జిల్లాలోని నందలూరు మండలంలో గల కోనాపురం ప్రాంతంలోనూ చేపల వేట సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ఒంటిమిట్ట, గోపవరం మండలాల్లో ఫారెస్టులో నుంచి వెళ్లాలి. ఇటు ఫారెస్టు అధికారులు అటు మత్స్యశాఖ అధికారులు చేపల మాఫియాపై గట్టి చర్యలు తీసుకుంటేనే సోమశిల మత్స్య సంపద తరిగిపోకుండా ఉంటుంది. కాగా.. సోమశిల బ్యాక్‌వాటర్ నుంచి మెయిన్‌రోడ్డు ఎక్కితే బద్వేలు - గోపవరం రోడ్డు వస్తుంది. ఇటు ఒంటిమిట్ట అదే విధంగా గండికోట జలాశయం నుంచి రోడ్డు ఎక్కితే హైవే వస్తుంది. జలాశయాల వద్ద కాకుండా హైవేలలో పోయే వాహనాలను పట్టుకోకూడదంటూ మత్స్యశాఖ అధికారులు పర్మిట్లు జారీ చేశారని సమాచారం. దీని వెనక మత్స్యశాఖ అధికారులకు భారీగా ముడుపులు అందాయని చర్చ సాగుతోంది. ఈ వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై మత్స్యశాఖ డీడీ శాంతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, జిల్లాలో చేపల వేటను పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ మరింత నిఘా పెంచి ఎక్కడైనా అక్రమ చేపల వేట జరుగుతుంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



కలెక్టర్‌కు తమ సమస్యలు తెలుపుకుంటున్న అర్జీదారులు



ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ శివశంకర్ లోతేటి
● డయల్ యువర్ కలెక్టర్‌కు 10 ఫిర్యాదులు

కడప(కలెక్టరేట్), జూలై 29: జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒక పనిమీద ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పొద్దన్నారు. ఈ సందర్భంగా ఖాజీపేట మండలం తుడుముల దిన్నెకు చెందిన వెంకటసురేశ్ తన భూమిని ఇతరుల పేరున ఆన్‌లైన్ చేసుకున్నారని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. పక్షవాతంతో నడవలేకున్నానని, ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని ఖాజీపేట మండలం అప్పనపల్లికి చెందిన వీర్రాజు కలెక్టర్‌ను కోరారు. ఇలాంటి అనేక ఫిర్యాదులను పరిశీలించి తదుపరి చర్యలకై అధికారులకు సిఫార్సు చేశారు. కాగా.. సోమవారం ఉదయం జరిగిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 10 పిర్యాదులు అందాయి. వెంటనే ఫిర్యాదులను పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు.

ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలి

● రీచుల్లో సీసీ కెమెరాల నిఘా : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 29: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక విధానాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఎన్ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ వెంకటరాముడు, డీటీసీ మీరాప్రసాద్, మైన్స్ డీడీ రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. ఇసుకు ఉచిత పంపిణీకి సంబంధించి నిర్వహణ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తున్నామని, ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపడం లేదన్నారు. కొండాపురం మండలంలోని చిత్రావతి తీర పరివాహకంలో కొత్తగా గుర్తించిన పి.అనంతపురం, ఏటూరు, సుగమంచి పట్నం, ఓబన్నపేట డసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక సేకరణ చేపడతామన్నారు. ఈ పాయింట్లలో మొత్తం 5,27,850 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. డివిజన్ స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీలు, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవోలను, డీఎస్పీలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో ప్రభాకర్‌రెడ్డి, ఆయా రెవెన్యూ డివిజన్ల అధికారులు, డీఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

కడప (క్రైం), జూలై 29: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో విషాదం

● తెలుగుగంగ రిజర్వాయర్‌లో గల్లంతై
● ముగ్గురు యువకులు మృతి



ఒడ్డుకు చేరిన ముగ్గురి మృతదేహాలు

ప్రొద్దుటూరు, జూలై 29: ప్రొద్దుటూరులో విషాదం చోటు చేసుకుంది. సరదాగా గడిపేందుకు వెళ్లిన ముగ్గురు యువకులు నీటమునిగి చనిపోయారు. ఆ కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా..

ప్రొద్దుటూరు పట్టణం మౌలానా ఆజాద్ వీధికి చెందిన పఠాన్ రహమతుల్లా(21), పవర్ హౌస్‌వీధికి చెందిన ఎస్కే. ముదాపీర్(21), సుందరాచార్యుల వీధికి చెందిన వేంపల్లె షాహిద్ మోహిద్దీన్ (22) స్నేహితులు. వీరు ముగ్గురూ ఆదివారం సాయంత్రం బైక్‌లో దువ్వూరు మండలం చల్లబసాయపల్లె సమీపంలోని తెలుగుగంగ రిజార్వాయర్ వద్దకు వెళ్లారు. సరదాగా సెల్ఫీలు తీసుకున్నారు. ఆ తరువాత నీటిలోకి దిగారు. వీరు ముగ్గురికీ ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయారు. ఆదివారం రాత్రి ముగ్గురు యువకులు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వారిస్నేహితులను ఆరాతీసారు. సోమవారం ఉదయం రిజర్వాయర్ దగ్గరకు వెళ్లిన స్థానికులు గట్టుపైన ఉన్న సెల్‌ఫోన్‌లు, దుస్తులు చూసి దువ్వూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఫోన్‌లను పరిశీలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి రిజర్వాయర్ నుంచి యువకుల మృతదేహాలను సాయంత్రానికి వెలికితీసారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు.

తండ్రి పోయి ఏడాది కాకముందే కొడుకు మృతి

వేంపల్లె షాషిద్ మోహినుద్దీన్ తండ్రి అల్తాఫ్ గతేడాది ఆగస్టు 18న అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి చనిపోవడంతో శివాలయం వద్ద గల ఓ మెడికల్ స్టోర్‌లో షాహిద్ పని చేస్తున్నాడు. ఇతనికి ఇంకా ఇద్దరు చిన్న తమ్ముళ్లు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన షాహిద్ మరణం ఆ కుటుంబాన్ని రోడ్డుపాలు చేసిందని బంధువులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

సెలవు కావడంతో ఇంటికి వచ్చి

ఎస్కే. ముదాపీర్ చిత్తూరు జిల్లాలోని అమరరాజా ఫ్యాక్టరీలో అప్రెంటీస్ చేసి అక్కడే ఉద్యోగంలో చేరాడు. ఇటీవలే పనిమీద ఇంటికి వచ్చాడు. ఇతనికి కూడా తండ్రిలేడు. తల్లి అన్న, చెల్లెలు ఉన్నారు. స్నేహితులు పిలవడంతో సరదాగా గడిపేందుకు ఆదివారం అలా వెళ్లిస్తామని చెప్పి తిరిగిరాలని లోకాలకు వెళ్లాడని ఆ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. వీరికి సొంత ఇల్లు కూడా లేదు. అద్దె ఇంటిలో ఉంటున్న పేదకుంటుంబమని స్థానికులు తెలిపారు.

లెక్చరర్ ఇంట్లో విషాదం

మృతి చెందిన ముగ్గురులో పఠాన్ రహమతుల్లా (21) ఒక్కడే ఫార్మసీ చదువుతున్న విద్యార్థి. ఇతని తండ్రి నాయబ్‌రసూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పుడూ ఎక్కడికి పెద్దగా తిరిగే వాడు కాని రహమతుల్లా స్నేహితులతో కలిసి వెళ్లి ఇలా మృత్యువాత పడ్డంతో లెక్చరర్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



ముగ్గురు మృతికి కారణమైన రిజర్వాయర్

15 రోజుల్లో నిందితులను గుర్తిస్తాం

● మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో కీలక డాక్యుమెంట్లు.. కేసు నమోదు
● మాధవరెడ్డి ఇంట్లో 500 డాక్యుమెంట్లు స్వాధీనం
● కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్

మదనపల్లె టౌన్, జూలై 29: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనలో క్రమపద్ధతిలో దర్యాప్తు చేస్తున్నామని, ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చాక, నిందితులను నిర్ధారించుకుని అరెస్టు చేస్తామని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఐజీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌కలెక్టరేట్‌లోని సీసీ టీవీల ఫుటేజితో పాటు, ఒక కారు డాష్‌బోర్డులోని మొబైల్ ఫుటేజిని కూడా పరిశీలించామన్నారు. ఈ ఘటనపై మదనపల్లె వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 135/2024గా కేసు నమోదు చేశామన్నారు. ప్రతి విషయాన్ని పకడ్బందీగా దర్యాప్తు చేస్తూ 15మంది అనుమానితులను విచారించామన్నారు. ఇప్పటివరకు 52మందిని విచారించామని, దీంతో పాటు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని, ఈ విషయమై మరో ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. ఆదివారం రాత్రి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు చేసినప్పుడు కొన్ని డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామని, మాజీ ఎమ్మెల్యేపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. మాధవరెడ్డి పరారీలో ఉన్నాడని, అయన ఇంట్లో సోదాలు చేసినప్పుడు 500 వరకు ఇళ్ల స్థలాలు, భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. హైదరాబాద్‌లో శశికాంత్ ఇంట్లో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని, మాజీ మంత్రి పీఏ తుకారం ఇంట్లో కూడా సోదాలు నిర్వహించామన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఇంట్లో సోదాలు చేసినప్పుడు డాక్యుమెంట్లు దొరకలేదన్నారు. సీఐడీ అధికారుల సహకారంతో ఈ కేసును 15 ప్రత్యేక బృందాల సహకారంతో దర్యాప్తు చేస్తున్నామని, 15 రోజుల్లోపు నిందితులను అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

టి.కోడూరులో కాల్పుల కలకలం

● కూటమిలో వర్గపోరు
● ఇరువర్గాలు రాళ్లతో దాడులు
● గాల్లోకి కాల్పులు జరిపిన ఎంపీటీసీ

కొండాపురం, జూలై 29: మండలంలోని ప్యాక్షన్ గ్రామమైన టి.కోడూరులో సోమవారం కాల్పులు కలకలం రేపాయి. కూటమి నాయకుల వర్గపోరులో ఇరుర్గాలు రాళ్లతో దాడి చేసుకోవడంతో ఒకరు తుపాకితో గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసుల కథనం మేరకు..

ఎన్డీయే కూటమికి చెందిన కోడూరు ఎంపీటీసీ రామమునిరెడ్డి ఇదే గ్రామానికి చెందిన జగదేకరెడ్డిల మధ్య వర్గపోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలో జరుగుతున్న సోలార్ పనుల్లో గ్రావెల్ తోలే విషయమై జగదేకరెడ్డి వర్గానికి చెందిన పవన్‌కుమార్ రెడ్డి, తమ అనుచరులతో కలిసి రామమునిరెడ్డి వర్గంతో సోమవారం ఘర్షణ పడ్డారు. ఇందులో భాగంగా పరస్పరం ఇళ్లపై రాళ్లతో దాడి చేసుకున్నారు. పరస్పరం రాళ్లదాడి జరగడంతో రామమునిరెడ్డి తన దగ్గరున్న లైసెన్స్‌డ్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ విషయం తెలిసి కొండాపురం సీఐ వేణుగోపాల్, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సంఘటన స్థలాన్ని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేయడంతో పాటు గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. రాళ్లదాడిలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారన్నారు. కాగా.. రాళ్ల దాడి సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసుల బొలేరో వాహనం కూడా స్వల్పంగా దెబ్బతిందని సమాచారం.



కొండాపురం మండలం టి.కోడూరులో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల మార్కెట్ యార్డులో
చీనీకాయల వ్యాపారం అంటే రైతులు హడలిపోతున్నారు.
సూట్ లేదని.. రైతులకు లాభాల పంటేనని ప్రకటించిన మార్కెట్ యార్డు..
చీనీ రైతులను సిండికేట్ వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఎన్నాళ్లీ దోపిడీ..?

● పులివెందుల మార్కెట్ యార్డులో..
● సూట్ లేకపోయినా దానికి రెట్టించిన నష్టాలు
● ఈ మార్కెట్ వ్యాపారం మాకొద్దు
● ఇది చీనీ రైతుల ఆవేదన

పులివెందుల, జూలై 29: పులివెందుల ప్రాంతం చీనీ సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ దాదాపు 25 వేల ఎకరాలలో చీనీ పంట సాగులో ఉంది. సింహాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లె, పులివెందుల తదితర మండలాల్లో చీనీ తోటలు విరివిగా సాగులో ఉన్నాయి. చీనీ పంట అంటే లాభాల పంటగా రైతులు చెప్పుకునే వారు. కానీ రెండు మూడు సంవత్సరాలుగా చీనీ రైతులు పెద్దఎత్తున నష్టాలు చవిచూస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, దిగుబడులు తగ్గడంతో పాటు వ్యాపారుల తీరుతో మరింత నష్టపోతున్నారు. పది టన్నులకు రెండు టన్నులు సూట్ (తరుగు) రూపంలో రైతులను వ్యాపారులు దోచుకుంటున్నారు. పులివెందుల మార్కెట్ యార్డులో సూట్‌లేని వ్యాపారం చేయాలంటూ రైతులు అప్పటి వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పాడా ఆధ్వర్యంలో పులివెందుల మార్కెట్ యార్డులో పది దుకా... వ్యాపారులకు అప్పగించి సూట్ లేకుండా చీనీకాయల కొనుగోలు ప్రారంభించారు. ఏడాది క్రితం నుంచి సూట్ లేకుండా చీనీకాయలను కొనుగోలు చేస్తున్నారు. కానీ వ్యాపారులు సిండికేట్‌గా చీనీకాయలకు ధరలను తగ్గించేస్తున్నారు.

సూట్ లేని వ్యాపారం ప్రారంభించక ముందు వ్యాపారులు నేరుగా పొలం వద్దకే వచ్చి చీనీకాయలు కొనుగోలు చేసేవారు. ఈ వ్యాపారం ప్రారంభించినప్పటి నుంచి చీనీతోటల వద్దకు వ్యాపారులు రావడం మానేశారు. దీంతో రైతులు చేసేది లేక పులివెందుల మార్కెట్‌కే చీనీకాయలను తరలించాల్సి వస్తోంది. అక్కడ వ్యాపారులు చెప్పిందే వేదం, చేసిందే శాసనం లాగా అయింది. వ్యాపారులంతా సిండికేట్ అయి రైతుల నుంచి తక్కువధరకు చీనీకాయలను వేలంపాట రూపంలో దక్కించుకుంటున్నారు. రెండున్నర సూట్ ప్రకారం వ్యాపారులకు పొలం దగ్గర అమ్మేదాని కంటే.. సూట్ లేకుండా పులివెందుల మార్కెట్ యార్డులో అమ్మే చీనీకాయలకే ధర తక్కువగా వస్తోందని రైతులు వాపోతున్నారు. సిండికేట్ అయిన పది నుంచి పదిహేను మంది వ్యాపారులు మాత్రమే వేలంలో పాల్గొని తక్కువ ధరకు కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం రూపంలో దక్కించుకున్న చీనీకాయలను అక్కడి నుంచి వ్యాపారులు ఢిల్లీ, కలకత్తా, ముంబై, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసి అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగురోజుల క్రితం వేంపల్లె మండలం మల్లేపల్లెకు చెందిన శ్రీనివాసరెడ్డి పులివెందుల మార్కెట్‌యార్డ్‌కు గ్రేడ్-1 చీనీకాయలను తీసుకు వచ్చాడు. అయితే వ్యాపారులు సిండికేట్ అయి వేలంలో టన్నుకు రూ.13,500తో పాడారు. ఈ ధరకు చీనీకాయలను అమ్మేందుకు రైతు నిరాకరించాడు. వెనక్కి తీసుకెళతానే గానీ అంత తక్కువ ధరకు అమ్మనని తేల్చి చెప్పాడు. చివరకు వ్యాపారులు మాట్లాడుకుని టన్ను రూ.15వేలతో కొనుగోలు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పులివెందుల మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్ కాకుండా చూడాలని చీనీ రైతులు కోరుతున్నారు.



పులివెందుల మార్కెట్ యార్డుకు రైతులు అమ్మకానికి తెచ్చిన చీనీకాయలు

అర్ధరాత్రి దొంగలు పడ్డారు

● నిఘా వేసి వెంబడించిన అన్నదమ్ములు ● రెండు బైక్‌లు, స్కార్పియో స్వాధీనం ● పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా



దొంగలు ఉపయోగించిన బైక్, స్కార్పియో



పోలీసులు స్వాధీనం చేసుకున్న కొత్త పల్సర్ బైక్

నంబులపూలకుంట, జూలై 29: అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేసింది. నలుగురు దొంగలు రెండు బైకులమీద వచ్చి నంబులపూలకుంట మండలానికి వచ్చారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో కొట్టంవారిపల్లి వద్ద వాహనాలను ఆపి.. ఓ ఇంటి వైపు వెళ్లారు. ఆ ఇంటి యజమాని గమనించి కేకలు వేశారు. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రత్నించారు. ఒక వాహనం రాయచోటి వైపు, మరో వాహనం కదిరివైపు వెళ్లాయి. ఇంటి యజమాని కుమారులు మహేష్, గణేష్ కదిరివైపు వెళుతున్నవారిని బైకుమీద వెంబడించారు. అది గమనించిన దొంగలు, గాండ్లపెంట మండలం చామలగొంది రోడ్డు సమీపంలో వాహనాన్ని వదిలి పరుగులు తీశారు. వారు వదిలి వెళ్లిన బైకు వద్ద సోమవారం తెల్లవారుజాము వరకు మహేష్, గణేష్ మాటు వేశారు. తెల్లవారు జామున ఏపీ 03 బీఎఫ్ 1746 నంబరుగల స్కార్పియో వాహనం అక్కడికి వచ్చింది. అందులో ఉన్న వ్యక్తులు దొంగలు వదిలివెళ్లిన బైకును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. మహేష్, గణేష్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో దొంగలు స్కార్పియో ఎక్కి తప్పించుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సోదరులిద్దరూ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు స్పందించి అదే మండలంలోని తిమ్మమ్మమర్రిను హైస్కూల్ వద్ద ఉన్న జనసేన మండల అధ్యక్షుడు చౌదరి సమాచారం అందించారు. వెంటనే ఆయన గ్రామస్థులతో కలిసి ఓ ఎక్స్‌కవేటర్‌ను, కొన్ని వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టించారు. స్కార్పియో రాగానే అందులో ఉన్న ముగ్గురు దొంగలను పట్టుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. వారిలో ఇద్దరు పారిపోగా, డ్రైవర్‌ను దొరకబుచ్చుకున్నారు. డ్రైవర్‌ను, స్కార్పియోను పోలీసులకు అప్పగించారు. స్కార్పియోలో ఇంటర్‌నెట్ పరికరాలు, మూడుకొత్త మొబైల్ ఫోన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించి.. తప్పించుకున్న ఇద్దరిని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకున్నారు. ఆ తరువాత మరో పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్థులే..

పోలీసులకు పట్టుబడిన స్కార్పియో వాహనం అన్నమయ్య జిల్లా తూముకుంట దిగువమూలకు చెందిన యోగీశ్వర్‌నాయుడు పేరిట ఉంది. వాహనాన్ని తానే నడుపుతుంటారు. పోలీసులకు పట్టుబడింది ఇతనే. మిగిలిన నలుగురు బైక్‌ల మీద రాగా.. వారిని కవర్ చేస్తూ యోగీశ్వర్ నాయుడు తన స్కార్పియోలో వచ్చాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకు (ఏపీ 40 బీపీ6889) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వారి జయప్రకాష్ పేరిట ఉంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు పట్టుకున్న మరో ఇద్దరు కర్ణాటకవాసులని తెలిసింది. ఈ ముఠా సూత్రధారి చిత్తూరు జిల్లావాసి అని పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడినవారిపై ఎర్రచందనం కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. సబ్ జైళ్లలో ఏర్పడిన పరిచయాలతో వీరు ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు

పోలీసుల అదుపులో ఉన్న దొంగల ముఠా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ముఠా సభ్యుల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లలో సిమ్ కార్డులు లేవని, ఇంటర్‌నెట్‌తో అన్ని మొబైల్స్ అనుసంధానం చేసుకున్నారని సమాచారం. స్కార్పియోలో ఉన్న యోగీశ్వర్ నాయకుడుకు వీరి కదలికలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారానే తెలుస్తాయి. వాటి ఆధారంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగి రక్షించేందుకు రంగంలోకి దిగేవాడు. ఇతని వద్ద ఉన్న పరికరాల ఆధారంగానే పారిపోయిన ఇద్దరిని పోలీసులు వెంటనే పట్టుకోగలిగారు.

నగదు.. ఆభరణాలు..

పట్టుబడిన స్కార్పియోలో రూ.10 వేలు నగదు, ఒక చేతి గడియారం, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, మూడు జతల అద్దాలు, వైఫై మోడెం, సెల్‌ఫోన్‌లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా దువ్వూరులో శనివారం రాత్రి ఓ బైక్‌ను చోరీ చేసి తెచ్చినట్లు సమచారం. పోలీసులకు పట్టుబడ్డ పల్సర్ వాహనం కొనుగోలు చేసి దాదాపు 20 రోజులై ఉంటుంది. ఇంకా నంబర్ కూడా రాలేదు.

గంజాయి విక్రేతలపై మెరుపుదాడులు

● 6.6 కిలోల గంజాయి స్వాధీనం ● నలుగురు అరెస్టు

కడప (క్రైం), జూలై 29: జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలతో కూడిన డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో 6.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో డీఎస్ఆర్ మిల్ సమీపంలో పుల్లయ్య అనే నిందితున్ని అరెస్టు చేసి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసు కున్నామన్నారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జనార్ధన్, ఓబులేసు అనే నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, అలాగే రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జగదీశ్ అనే నిందితున్ని అరెస్టు చేసి 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.

మద్యంషాపులో రూ.4.88 లక్షలు చోరీ

అట్లూరు, జూలై 29 : మండలంలోని రెడ్డిపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం షాపులో సోమవారం తెల్లవారుజామున రూ.4.88 లక్షలు చోరీ జరిగినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. మద్యం షాపు పక్కనే ఉన్న హోటల్ నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. షాపులో ఉన్న లాకరును బయటకు తీసుకెళ్లి... అందులో ఉన్న రూ.4.88 లక్షలు నగదు చోరీ చేశారని తెలిపారు. కడప ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మద్యం షాపు సూపర్‌వైజరు, సేల్స్‌మ్యాన్‌లు, వాచ్‌మెన్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది పైనే అనుమానం వ్యక్తం చేస్తూ.. చోరీకి గురైన రూ.4.88 లక్షలు సిబ్బందే చెల్లించాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

సికెదిన్నె, జూలై 29: అత్తవారింటి వేధింపులు తట్టుకోలేక ఆదివారం రాత్రి సయ్యద్ అఫ్రిన్‌భాను (26) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ శివ శంకర్‌నాయక్ వివరాల మేరకు.. మండలంలోని బోడెద్దులపల్లె గ్రామానికి చెందిన ఇక్బాల్‌బాష, అఫ్రిన్‌భానులకు 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. అదనపు కట్నం కోసం అత్తవారింటిలో వేధిస్తుండడంతో ఆదివారం రాత్రి ఇంటిలోని ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని చనిపోయిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడికోసం.. కొట్టి చంపాడు



మృతి చెందిన వెంకటరెడ్డి

నందలూరు, జూలై 29: మండలంలోని ఎర్రచెరువుపల్లెలో ఆదివారం రాత్రి ఇరుగు పొరుగు వారి మధ్య జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. సాతుపల్లి వెంకటరెడ్డి తన పెంపుడు కోడి కనిపించడం లేదని వెతుకుతూ.. దానిని దొంగలించిన వారిని వదిలి పెట్టనని తిట్టాడు. పొరుగున ఉండే నాగప్రతాప్‌రెడ్డి ఆగ్రహించి మంచితనంగా వెంకటరెడ్డిని ఇంటి దగ్గరికి రమ్మని.. మీ కోడి మా ఇంట్లోనే ఉందని నమ్మబలికి.. ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో లైట్లు ఆఫ్‌చేసి అతనిని విచక్షణ రహితంగా కొట్టారు. అనంతరం నాగ్రపతాప్‌రెడ్డి వీధిలోకి వచ్చి సత్తుపల్లి వెంకటరెడ్డిని మా ఇంటి ఆవరణలో కొట్టి పడేశాను మీరు తెసుకెళ్లండి అని ఇరుగు పొరుగు వారికి తెలుపుతూ అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. గ్రామస్థులు సంఘటనా స్థలికి వెళ్లేసరికి రక్తపుమడుగులో వెంకటరెడ్డి ఉన్నాడు. వెంటనే గాయపడిన వ్యక్తిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మృతి చెందినట్లు సమాచారం. దాడి చేసిన నాగ ప్రతాప్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు నందలూరు ఎస్ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

రూరల్ సీఐ కార్యాలయంలో అగ్నిప్రమాదం

బద్వేలు రూరల్, జూలై 29 : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని రూరల్ సీఐ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న సీపీవో సిస్టంతో పాటు ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. కేసులకు సంబంధించిన కీలక ఫైళ్లన్నీ బీరువాలో భద్రంగా ఉన్నట్లు రూరల్ సీఐ విక్రమసింహ తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 40 మంది ఫిర్యాదు దారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడే వారి సమస్యలను అడిగి తెలుసుకుని.. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అలాగే జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే అర్జీలను పరిశీలించి చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్‌సిస్టం) కార్యక్రమానికి సోమవారం మొత్తం 40 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపించి.. విచారించి అనంతరం చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. కాగా, రైల్వేకోడూరుకు చెందిన క్రిష్ణారెడ్డి అనే రైతు తన భూమిని ఆక్రమించారని ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. రాజంపేట డీఎస్పీకి ఫార్వర్డ్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయం తనిఖీ



జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కర్నూల్ రేంజ్ డీఐజీ

రాయచోటిటౌన్, జూలై 29: అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు జిల్లా కేంద్రంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పూలమొక్కలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం డీఐజీ జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి పోలీసు సిబ్బందికి, అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందుగా జిల్లా ఆర్మ్ పోలీసు సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లాఅండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అసాంఘిక శక్తులతో పాటు ఎర్రచందన అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

పరిశోధన ఫలాలు అందించాలి



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ సుమతి

సికెదిన్నె, జూలై 29: శాస్త్రవేత్తలు రైతులకు పరిశోధన ఫలాలు అందించాలని సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రయోగాత్మకంగా సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందించి వారికి ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. దిగుబడులు పెంచేందుకు శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని.. అందుకు శాస్త్రవేత్తలు పరిశోధనల్లో కనుగొన్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శిల్పకళ, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరి, మహేష్, కృష్ణప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు పెండింగ్ లేకుండా చేపట్టాలి



కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ శివరామ్

కడప(కలెక్టరేట్), జూలై 29: రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఏ రోజు కారోజు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని.. రేపు మాపు అంటూ తిప్పొద్దని... ఆలస్యమైనా సరే సాయంత్రం వేళల్లో ఆఫీసుల్లో ఉండి రిజిస్ట్రేషన్లు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరామ్ ఆదేశించారు. సోమవారం కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆయన విజిట్ చేశారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని పలు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. భూము లు, స్థలా లు క్రయ, విక్రయాలు జరిపే వినియోగదారుల సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజల పట్ల గౌరవ మర్యాదలతో నడుచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మొక్కుబడిగా విధుల్లో ఉండకూడదని హెచ్చరించారు. అనంతరం రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇబ్బందులను డీఐజీకి డాక్యుమెంట్ రైటర్లు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ సెమిస్టరుపరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్

కడప (ఎడ్యుకేషన్), జూలై 29: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్‌అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీలో కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, హైస్కూలు ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన రెండో సెమిస్టరు, ఆర్కిటెక్చర్‌కు సంబంధించి 4, 6, 8 సెమిస్టరు రెగ్యులర్ పరీక్ష ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్, రిజిస్ట్రారు ప్రొఫెసరు రాజేశ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. సోమవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలను వెల్లడించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ నాలుగో సెమిస్టరు ఫలితాల్లో 93 శాతం, ఆరవ సెమిస్టరు 60శాతం, 8వ సెమిస్టరు 75వ శాతం ఉత్తీర్ణత సాధించా రన్నారు. కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూలు ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన రెండో సెమి స్టరు ఫలితాల్లో 70 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్ష ఫలితాలు కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రారెడ్డి, విజయ్‌ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీ ప్రవల్లిక పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ ప్రవేశాలకు విశేష స్పందన

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో ప్రవేశాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఏడీ సెట్ కమిటీ చైర్మన్, కన్వీనరు, ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ ఆధ్వర్యంలో కౌన్సెల్ ప్రక్రియ జరిగింది. ఏడీ సెట్ 2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించారు. క్యాంపస్‌లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కౌన్సెలింగ్ చేశారు. సోమవారం ఒక్కరోజే 50 మందికి పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. డీఎఫ్ఏలో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లై ఆర్ట్, శిల్పం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో వైఏయూ అసిస్టెంటు ప్రొఫెసరు సుబ్బరా యు డు, ప్రొఫెసరు ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు విజయలక్ష్మి, రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

248 పరుగుల ఆధిక్యతలో కడప జట్టు

● 65 పరుగుల వెనుకంజలో చిత్తూరు



147 పరుగులు చేసిన గురుచరణ్ (కడప)



119 పరుగులు చేసిన యువన్ (విశాఖ)

కడప (స్పోర్ట్స్) జూలై 29 : ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీలో భాగంగా కడప నగర పరిధిలో జరుగుతున్న వివిధ జట్ల క్రికెట్ మ్యాచ్‌లలో ఆటకు రెండవ రోజైన సోమవారం కడప జట్టు 248 పరుగుల ఆదిక్యతతో ముందుకు సాగుతోంది. మరో మ్యాచ్‌లో 65 పరుగుల వెనుకంజలో చిత్తూరు జట్టు ఎదురీదుతోంది. ఇదిలా వుండగా మరో మ్యాచ్‌లో విజయానికి 356 పరుగుల దూరంలో వెస్ట్ గోదావరి జట్టు ఎదురీదుతోంది. వివరాలిలా...

కడప నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో క్రిష్ణా-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో క్రిష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి (ఆదివారం) 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 370 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 370 పరుగులతో రెండవరోజైన సోమవారం తిరిగి ఆట ప్రారంభించిన క్రిష్ణా జట్టు 7.2 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి మొత్తంగా 97.2 ఓవర్లలో 396 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ జట్టులోని గీత్ 103 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ సాయి చరణ్ 5 వికెట్లు సాధించారు. ఇదిలావుండగా బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 331 పరుగులతో ధీటుగా ఆడుతోంది. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 75 పరుగులు చేయగా.. చరణ్‌జిత్ 60 పరుగులు, గౌతమ్ క్రిష్ణ 93 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు ఇంకా 65 పరుగుల వెనుకంజలో వుంది. మంగళవారం ఆటకు చివరిరోజు

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 204 పరుగులు చే సిన సంగతి తెలిసిందే. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 132 పరుగులతో తిరిగి రెండవరోజున బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 116 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 452 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోహిత్ 82 పరుగులు చేయగా.. గురుచరణ్ 147 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో కడప జట్టు 248 పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో విశాఖ, వెస్ట్ గోదావరి జట్ల మధ్యసాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌గోదావరి జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 123 పరుగులతో రెండవరోజైన సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి ఎట్టకేలకు మరో 2.3 ఓవర్లపాటు క్రీజ్‌లో నిలిచి 8 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో మొత్తం 131 పరుగులు చేసినట్లయింది. ఆ మేరకు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 67.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 366 పరుగులు చేసింది. ఇందులో యశ్వంత్ 118 పరుగులు, యువన్ 119 పరుగులు చేయడం విశేషం. దీంతో ఆ జట్టు తన రెండు ఇన్నింగ్స్‌లో ఏకంగా 537 పరుగులు చేసినట్లయింది. ఇందుకు ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులతో నిలిచింది. విజయానికి ఇంకా 356 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. ఆటకు మంగళవారం చివరిరోజు.

సమస్యలను పరిష్కరిస్తా - ఎమ్మెల్సీ



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూలై 29: ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో రామగోపాల్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ముందుగా ప్రజల వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను చెప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాల పోస్టర్లు విడుదల

చక్రాయపేట, జూలై 29: గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాసోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు కేసరి సోమవారం పులివెందులలో ఉన్న ఎమ్మెల్సీని కలిసి పోస్టర్లను విడుదల చేయించారు. ఈ కార్యక్రమంలో కావలి భానుకిరణ్ రాయల్, పోతిరెడ్డిశివ, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన టీడీపీ నేత హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 29 :కడపనగరం ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు బండి బాబు, కుప్పాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

డీఐజీ దృష్టికి పోలీసు సిబ్బంది సమస్యలు

కడప (క్రైం), జూలై 29 : కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను సోమవారం జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. ఈ మేరకు వారు జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యలు తదితర అంశాలపై ఆయన డీఐజీకి వివరించినట్లు తెలుస్తోంది.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 29 : కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్‌ఎస్‌ఎఫ్ యూనిట్ కడప ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ చెట్ల ప్రాముఖ్యతను తెలిపి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాటి శారద, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌ఛార్జ్ మరియు ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రాజు దాసరి వైద్యవిద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి కుర్చీలు, టేబుళ్ల వితరణ

పులివెందుల రూరల్, జూలై 29: పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కుర్చీలు, టేబుళ్లు వితరణ చేశారు. ఆసుపత్రి ఉద్యోగి అయిన లింగాల రవిశంకర్‌రెడ్డి తన సొంత డబ్బుతో 50 కుర్చీలు, 10 టేబుళ్లు సమకూర్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. సోమవారం వీటిని అందించినట్లు తెలిపారు. మూడు విభాగాల్లోని కొన్నిచోట్ల అరకొర కుర్చీలతో సిబ్బంది, రోగులకు సహాయంగా వచ్చే వారు ఇబ్బంది పడే వారన్నారు. రవిశంకర్‌రెడ్డి సహకారంతో కొంతమేర ఉపశమనం లభించిందన్నారు. ఆయన సహకారం మరువలేమని, మరికొంతమంది దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. డాక్టర్ విశ్వేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కుముదవలి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురు పురస్కారం

చక్రాయపేట, జూలై 29: గండి క్షేత్రలోని వాసవీ నిత్యాన్న దాన సత్రంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కడపజిల్లా బద్వేలుకు చెందిన మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షు డు విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జివి మనోజ్ కుమార్‌ను సంఘటిత సాహిత్య శిరోమణి, సాహిత్య సేవారత్న బిరుదుతోపాటు శాలువ, జ్ఞాపిక, పారితోషికంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రగంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, రాష్ట్ర కోశాధికారి అసుండి హనుమాన్‌శాస్త్రి, ప్రముఖ పం చాంగకర్త బుట్టే వీరభద్ర దైవజ్ఞ సిద్ధాంతి, సంస్కృత పండితుడు పీజీటీవీ రంగాచార్యులు, విద్యావేత్త చంద్ర శేఖర్ కల్యాకరతదితరులుపాల్గొన్నారు.

గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.1.73 లక్షలు

సికెదిన్నె, జూలై 29: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మగుడికి హుండీ ద్వారా రూ.1,73,779 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భక్తుల సమక్షంలో సోమవారం హుండీని తెరచి లెక్కించగా పై మొత్తం వచ్చిందని, దీనిని దేవస్థానం అకౌంట్‌లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్, భక్తులు శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, విజయభాస్కర్, పద్మావతి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



'విద్యార్థులకు విందు భోజనం' సంతోషకరం



చెన్నూరు: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వాసుదేవరెడ్డి

చెన్నూరు, జూలై 29 : పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒకరోజు భోజనం ఏర్పాటు చేయడం ఆనందకరమని టీడీపీ సీనియర్ నేత కొక్కిరాయపల్లె మాజీ ఎంపీటీసీ చింతకుంట వాసుదేవరెడ్డి అన్నారు. శిక్ష సప్తాహలో భాగంగా కొక్కిరాయపల్లె పాఠశాలలో విద్యార్థులకు మాంసాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 సునీత మాట్లాడుతూ పేద పిల్లలకు ఒకరోజు రుచికరమైన ఆహారం అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు దాత వాసుదేవరెడ్డి స్పందించారన్నారు. ఇలాంటి దాతలు మరింత మంది ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాత వాసుదేవరెడ్డిని అధికారులు నేతలు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. సర్పంచ్ సూర్యనారాయణ, టీచర్ వీరనారాయణ, టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి, ఎంఈవో కార్యాలయ సిబ్బంది రవిచంద్ర, విజయమ్మ, గురవయ్య, లక్ష్మణ్, చెన్నూరు రాంప్రసాద్, హెచ్‌ఎం హేమలత పాల్గొన్నారు.

చక్రాయపేట: మండలంలోని మహదేవపల్లె ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం శుభదిన భోజనం అందించారు. శిక్షా సప్తాహ్ చివరిరోజు కార్యక్రమంలో భాగంగా టీడీపీ బీసీ నాయకుడు కృష్ణగిరి రమేష్ భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవికుమార్, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమం ఎంతో మందికి ఆదర్శంగా ఉంటుందన్నారు. దాతలు ముందుకొచ్చి విద్యార్థులకు శుభదిన భోజనాలు ఏర్పాట చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీకే దిన్నె: విద్యార్థులకు దాతల సహాయంతో శుభభోజనం అందించడం ఎంతో శుభపరిణామం అని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయప్పరాజు తెలిపారు. స్థానిక నాగిరెడ్డిపల్లె పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టీడీపీ మండల ఇన్‌చార్జి టక్కోలి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చికెన్ వండించి విద్యార్థులకు వడ్డించారు. దాతలు స్ఫూర్తిగా తీసుకుని శుభభోజనం కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు పోషకాహారం అందించాలన్నారు.

వీరపునాయునిపల్లె: ఉరుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి పాయసం అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్: పట్టణంలోని అహోబిలాపురం మండల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం తిథి భోజనం ఏర్పాటుచేశారు. ఇదే పాఠశాలఉపాధ్యాయురాలు గోటూరు ఉష పాయసం, అన్నం, పప్పు, అరటి పండు సమకూర్చగా ఎంఈఓ చంద్రశేఖర్‌రావు వడ్డించారు. ఉషను ఎంఈఓతో పాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే ఆర్.మాధవి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 29 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నడుస్తూ పేద బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉంటామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి అన్నారు. సోమవారం కడప నగరంలో ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 28వ డివిజన్ మేకలదొడ్డి, మూడో డివిజన్, తిలక్‌నగర్, బ్రహ్మయ్య పెట్రోలు బంకు పక్కన, 4వ డివిజను ఆర్‌కే నగర్‌లో రేషన్‌షాపులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు రాగిపిండి, గోధుమలు, ఉద్దిపప్పు, శెనగ పప్పు, నూనె అందించినట్లు తెలిపారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ పక్కనబెట్టి కేవలం బియ్యం మాత్రం అది కూడా కేంద్రం ఇచ్చిన బియ్యాన్ని మాత్రమే పేదలకు అందిస్తూ దానిపై కూడా జగన్ బొమ్మ పెట్టుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజాధనాన్ని ఆస్తులను వైసీపీ ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. 40వేల కోట్ల ఆస్తులు కబ్జా చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నాలు చేస్తూ రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో దిగజార్చే ప్రయత్నం చేస్తున్నా రని తెలిపారు. ప్రజలు జగన్‌రెడ్డి చేసిన అరాచకాలను చూడలేక తగిన రీతిలో గుణపాఠం చెప్పారని కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీతో విజయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు.

పీఎం తిథి భోజన్ కార్యక్రమంలో..

25వ డివిజన్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలులో లక్ష్మీనరసింహులు, చంద్ర ముని, అనూష్‌లు ఆధ్వర్యంలో పీఎం తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవి హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం పెట్టడం దైవ కార్యంతో సమానమన్నారు. దాతలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, టీ డీపీ నేతలు రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల పురోగతికి బాటలు వేయండి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నాయకులు

కడప (మారుతీనగర్), జూలై 29: వివక్షను కూకటివేళ్లతో పెకలించి, దళిత, గిరిజనుల పురోగతికి బాటలు వేయాలని రాష్ట్ర మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజీ ఇమ్మానియేలు, ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్‌కుమార్, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మచ్చయ్యగారి నాగ మల్లేష్ కోరారు. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో కుల వివక్ష యథేచ్ఛగా సాగిందని, ఆ పోకడలను ప్రస్తుత తెలుగుదేశం పాలనలో కనుమరుగయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా రాష్ట్రవ్యాప్తంగా పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ఆ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటుగా ప్రజలందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, దేవాలయ ప్రవేశాలను తరచుగా చేపట్టడం ద్వారా ప్రజల్లో వివక్ష పోయి మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు తగిన బాధ్యత తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అనాదిగా దళితులు వివక్షతో పాటుగా అభివృద్ధి, సంక్షేమం, విద్య వైద్యం, ఉపాధి, భూమికి దూరంగా వుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దళితుల సమగ్రాభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో రావ లసిన నష్టపరిహారం తక్షణమే విడుదల చేయాలన్నారు. హత్యకు గురైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. విజయ్‌గోపాల్, పబ్బాపురం సర్పంచ్ లక్ష్మీరెడ్డి, రాష్ట్ర మాలమహానాడు మహిళా ప్రధానకార్యదర్శి కె. శాంతకుమారి, రాయలసీమ అధ్యక్షుడు సా గర్ వినయ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు మే సా వేదవతి, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వ ర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, కార్యదర్శి సూరి బాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గైడ్‌లైన్స్ వచ్చేవరకు ఏడీపీ సర్వే నిలిపివేయాలి



ఇన్‌చార్జి కమిషనరుకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్లు

కడప (ఎడ్యుకేషన్), జూలై 29 : కొత్త ప్రభుత్వం గైడ్‌లైన్స్ విడుదల చేసేంత వరకు ఏడీపీ సర్వే నిలిపివేయాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశా రు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు చేసిన తీర్మానాన్ని అధికారులు పక్కనబెట్టి అధిక పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధన లు పాటించని అధికారులపై వచ్చే సర్వసభ్య సమావేశంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కడప కార్పొరేషన్ కార్యాలయం మేయరు చాంబరులో కార్పొరేటర్లు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలపై పన్నులబారం వేయకూడదన్నదే తమ లక్ష్యమన్నారు. కొత్త ప్రభుత్వంలో గైడ్‌లైన్స్ వచ్చే వరకు ఏడీపీ సర్వేను నిలిపి వేయాలని తీర్మానం చేసిన విషయం గుర్తు చేశారు. అయితే అధికారులు 198 జీవోను అడ్డం పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్క డాలేని విధంగా కడప కార్పొరేషన్‌లో మాత్రమే ఏడీపీ సర్వే అమలు చేస్తున్నారన్నారు. గత మూడునెలల్లోనే 20 కోట్ల రూపాయలు అసెస్‌మెంటు పెంచి పన్నులు వేశారన్నారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చేంత వరకు ఏడీపీ సర్వే నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రాఖిబ్‌చంద్రకు వినతిపత్రం అందించారు. కార్పొరేటర్లు పాకాసురేశ్, సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, షంషీర్, సూర్యనారాయణ, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్

కడప(రూరల్) జూలై 29 : ద్విచక్ర వాహనదారుడితోపాటు పిలియన్ కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాపక్రుద్దీన్ సూచించారు. సోమవారం షిర్డిసాయి ఎలెక్ట్రికల్స్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి సంధ్య థియేటర్ సర్కిల్ వరకు వరకు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. శ్రీహరి డిగ్రీకళాశాలలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు, పారాలీగల్ వాలంటీ ర్లు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఎన్జీవోలు, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలని మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం సంయుగ్లాస్ యాజమాన్యం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రకాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, సంయు గ్లాస్ ఫ్యాక్టరీ మేనేజర్ సింధుకుమార్, సిబ్బంది, ప్రజలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం సమర్పిస్తున్న రామాంజనేయులు

వేంపల్లె, జూలై 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్య క్షుడు రామాంజనేయులు, బాలాజీ విజ్ఞప్తి చేశారు. పులివెందులలోని టీ డీపీ కార్యాలయంలో ఆయనను కలి సి వినతి పత్రం అందించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం బోర్డుకు సంబంధించిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని తెలిపారు. ఆ నిధులను తిరిగి కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కిట్టయ్య, బుజ్జి, శ్రీను పాల్గొన్నారు.

వేంపల్లెలో రోడ్డు పనులను తిరిగి ప్రారంభించాలి

వేంపల్లె, జూలై 29: గత ప్రభుత్వంలో ప్రారంభమై పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్లు, కాల్వ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి టీడీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లెలో అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డు, కాల్వలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు, సీపీఐ నాయకులతో కలిసి తులసిరెడ్డి పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటరమణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంత మేరకు పనులు జరిగాయి, బిల్లులు వచ్చాయా, పెండింగ్ బిల్లులు ఎంత మేరకు ఉన్నాయని వాకబు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని, ప్రభుత్వం వెంటనే బిల్లులుచెల్లించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వేంపల్లెలో ప్రజలు, వ్యాపారులు దుమ్ముతో అవస్థలు పడుతున్నారని, పరిస్థితి ఇలాగే ఉంటే శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడతారని తెలిపారు. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం అర్థాంతరంగా నిలిచిన పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, చెన్నకేశవ, బాలం సుబ్బరాయుడు, వేమా నాగరాజు, సీపీఐ నాయకులు బ్రహ్మం, ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు రంతుల్లా పాల్గొన్నారు.

రైతు బజార్‌లో దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, జూలై 29: రైతుబజార్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకునే రైతులు దరఖాస్తు ఇవ్వాలని స్థానిక రైతుబజార్ అధికారిణి రుచిత తెలిపారు. ఆగస్టు 6వ తేదీ నుంచి రైతు బజార్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సోమవారం రైతు బజార్ వద్ద రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎనిమిది గదులు, 44 స్టాల్స్ ఉండగా స్టాల్స్ పూర్తిగా ఉచితం, రైతులు ఎవరైనా తమ ఉత్పత్తులను ఉంచుకొని వ్యాపారం చేసుకోవచ్చు అన్నారు. ఎనిమిది దుకాణాలు ఉన్నాయని వాటికి మాత్రమే దరఖాస్తులు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. సుమారు 15 దరఖాస్తులు వచ్చాయి, ఇంకా ఎవరైనా దరఖాస్తులు ఇవ్వవచ్చునని తెలిపారు.

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 29 : పాఠశాల విద్యా వ్యవస్థలో నెల కొన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం స్పందన హాలులో డీఈ వో అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జీవోనెం.1 పటిష్టంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఇంకా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయని పాఠశాలలకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన నాడు నేడు పనులకు సంబంధించి అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు చందునాయక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అధ్వాన స్థితిలో కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 29 : కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నెలల తరబడి మురుగు నీటి నిల్వతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో కడప డిపో మేనేజరు డిల్లేశ్వర్ రావుకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ నెలల తరబడి మురుగునీటి నిల్వతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ డిపో మేనేజరు కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన గేటు వద్దనే మురుగునీరు నిల్వ ఉండి రాకపోక లకు ఇబ్బంది కలిగినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వర్షం వచ్చినప్పుడల్లా ఆర్టీసీ గ్యారేజీలో నీరు నిలిచి కార్మికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య మెరుగుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కా ర్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గసభ్యులు మల్లికార్జున, శంకర్‌నాయక్, సుబ్బ రాయుడు, భాగ్యలక్ష్మి, యేసురత్నం, అంకుశం పాల్గొన్నారు.

పందులను తరలించకపోతే చర్యలు



పందుల యజమానులను హెచ్చరిస్తున్న ఎంపీడీవో సుబ్రమణ్యం శర్మ

చెన్నూరు, జూలై 29: పందులను మూడురోజుల్లో తరలించకపోతే తీవ్రంగా నష్టపోతారని ఎంపీడీవో సుబ్రమణ్యం శర్మ హెచ్చరించారు. సోమవారం పందుల యజమానులను స్థానిక రెవెన్యూ కార్యాలయానికి పిలిపించి హెచ్చరికలు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇష్టాను సారంగా పందులు పెంచుతూ వాటి వల్ల ప్రజలకు రోగాలు తీసుకువస్తున్నారని అవి విచ్చలవిడిగా తిరుగుతూ అటు పంటలు సైతం నాశనం చేస్తున్నాయన్నారు. ఇక అలాంటి పరిస్థితి కుదరదని, వాటిని అమ్ముకుంటారో, ఇతర ప్రాంతాలకు తీసుకుపోతారో.. మూడు రోజుల్లోగా పందులున్నాయన్న మాట వినిపించకూడదు, కనిపించకూడదని హెచ్చరించారు. లేదంటే అధికారులే చర్యలు తీసుకుంటారని, పెంపకదారులను జైలుకు పంపడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దరు వెంకటరమణ, ఈవో ఆర్‌డీ సురేశ్‌బాబు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మినుములో మారుక మచ్చల పురుగు

చెన్నూరు, జూలై 29 : మినుము పంటకు ఇబ్బందిగా మారే మారుక మచ్చల పురుగు ఉధృతిని పూర్తిగా తగ్గించాలని మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి అన్నారు. ముండ్లపల్లెలో మినుము పైరును సోమవారం వ్యవసాయాధికారి పరిశీలించారు. 35 రోజుల వయసు ఉన్న పైరుకు ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 5 మిలీ చొప్పున వేపనూనెను కలిపి పిచికారీ చేయాలన్నారు.మొగ్గ, పూతదశలో పురుగు కనబడిన వెంటనే చేతితో ఏరివేసి నాశనం చేయాలన్నారు. వాటి నివారణకు థయోడికార్బ్ లీటరు నీటికి ఒక గ్రాము, లేదా ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒకవేళ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటరు నీటికి లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ సిబ్బంది ఇందిర, స్వర్ణ, ఎంపీఈవో తదితరులు పాల్గొన్నారు. రామనపల్లెలో వరిలో కాండం తొలుచు పురుగు నివారణపై సూచనలిచ్చారు. ముఖ్యంగా తల్లి పురుగు వరి ఆకు చివరి భాగంలో గుంపులు గుంపులుగా గుడ్లను పెట్టి అందులో కప్పివేసి ఉంటుందన్నారు. ఒకవేళ రైతులు అది గమనించక వరి కొనలను అలాగే ఉంచి నాటితే పురుగు ఉధృతి ఎక్కువై పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. కొనలు తుంచి నాటడం వల్ల గుడ్లు నాశనం అవుతాయని తెలిపారు. వీఏఏ సునీల్, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చే పురుగులు నివారించాలి

కమలాపురం రూరల్, జూలై 29 : పత్తిపంటలో రసం పీల్చే పురుగుల నివారణకు మందులు పిచికారి చేయాలని మండల ఏవో సరస్వతి తెలిపారు. సోమవారం మండలంలోని సంబటూరు, కోగటం గ్రామాల్లో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో బెట్టను త ట్టుకునేందుకు లీటరు నీటికి 20 గ్రాములు యూరియా లేదా 5 గ్రాములు 19.19.19 లేదా పంట పూత దశలో ఉన్నట్లయితే 13.0.45, 10 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. మినుములో రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.4 మిలీ, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిలీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు పిచికారీ చేసుకుని 15 రోజుల తరువాత ఫ్రిప్రొనిల్ 2 మిలీ లేదా డైఫన్ థియురాన్ 1.25 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



మయూర హోటల్‌లో పూర్వ విద్యార్థులు

కడప (నాగరాజుపేట), జూలై 29 : మైదుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం కడపలోని మయూర హోటల్‌లో కలుసుకున్నారు. తమ గురువులను సన్మానించారు. 30 ఏళ్ల నాటి అనుభవాలను, చిలిపి చేష్టలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. వారి సహ విద్యార్థిని ప్రవాస భారతీ యురాలు సఘమిత్ర ఆతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రికార్డు గదికి మరమ్మతులు



మరమ్మతులు చేసిన రికార్డు గదులు

కడప(కలెక్టరేట్) జులై 29: కడప తహసీల్దారు కార్యాలయంలోని రెవెన్యూ రికార్డుల రూమ్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటపతి ఇన్‌చార్జి తహసీల్దారు శివారెడ్డిని ఆదేశించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో రికార్డుల రూమ్‌కు రక్షణేదీ అనే శీర్షికతో ప్రచురితమైన కథనం పై స్పందించిన ఆర్డీవో ఆదివారం ఉదయాన్ని తహసీల్దారు కార్యాలయాన్ని , రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. గది శిథిలావస్థలో ఉండడంతో పాటు కిటికీలు, వాకిళ్లకు రేకులు ఫ్లెక్సీలు అడ్డుపెట్టడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మ తులు చేయించాలని ఆదేశించారు. వెనువెంటనే ఎక్స్‌క వేటర్‌ను తెప్పించి ఫ్లెక్సీ లను, అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడమే కాకుండా సిమెంట్ దిమ్మెలతో కిటికీలు, రేకులు తొలగించి, మరమ్మతులు పూర్తి చేసినట్లు తహసీల్దారు శివారెడ్డి తెలిపారు..

సాటి మానవుల సేవతోనే జన్మధన్యం

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 29 : మానవసేవతో జన్మ ధన్యమవుతుందని లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు ఖాసింఖాన్ అన్నారు. కడప నగరం మానస సమావేశ మందిరంలో సోమవారం క్లబ్ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా సంస్థ నూతన అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ శక్తివంచన లేకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేస్తామన్నారు. అనంతరం లయన్ ఖాసింఖాన్ రూ.50 వేలు విరాళాన్ని పాస్ట్ గవర్నరు లయన్ చిన్నపరెడ్డి ద్వారా నూతన అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యకు అందించారు. ఆయనతో పాటు మరికొంతమంది విరాళాలను అందించారు. ఉపాధ్యక్షుడుగా బోగాల కొండారెడ్డి కార్యదర్శిగా జనార్దనరాజు, సహకార్యదర్శిగా ఎస్‌ఎండీ బాషా. కోశాధికారిగా డి.రవీంద్రనాథ్, గౌరీశంకర్, ముఖేష్‌తో సీనియర్ లయన్స్ రామచంద్ర ప్రకాశ్, విరూపాక్షరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీకాంత్, హరినాథరెడ్డి ప్రమాణం చేయించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పెండ్లిమర్రి, జూలై 29: శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించాలని ఏవో ఓబులేసు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఓబులేసు, ఏపీఓ ఓబుళమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి గంగాధర్‌రెడ్డి, ఈసీ నాగమల్లేశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటయ్యేనా..?

● కూరగాయల రైతుల ఆశలు నెరవేరేనా..? ● గత ప్రభుత్వంలో పునాదులకే పరిమితమై.. కనుమరుగైన వైనం

పోరుమామిళ్ల, జూలై 29 : పోరుమామిళ్ల చుట్టుపక్కల గ్రామాలు కలసపాడు, కాశినాయన మండలాలకు సంబంధించి ఎక్కువ మంది కూరగాయల తోటలు పండించే రైతులు చాలా మంది ఉన్నారు. వారు తాము పండించిన కూరగాయలను పోరుమామిళ్ల ప్రాంతంలో అమ్మకాలు చేసుకునేందుకు సరైన శాశ్వతమైన స్థలం లేకపోవడంతో రోడ్ల పక్కనే వ్యాపారాలు చేసుకుంటు న్నారు. ముఖ్యంగా కమ్మవారిపల్లె, కాశినాయన మండలం లోని చాలా గ్రామాలు కలసపాడు మండలంలోని గ్రామాల్లోని కూరగాయలు, ఆకుకూరలను పండిస్తుంటారు. చాలా మంది తెల్లవారుజామునే పోరుమామిళ్ల ప్రాంతాలకు వచ్చి రోడ్లపక్కనే వ్యాపారాలు చేసుకుంటూ వెళ్లిపోతుంటారు. అంతేకాక పోరుమామిళ్లలో కూరగాయల వ్యాపారం చేసేవారు వారికి కేటాయించు కున్న స్థలం సరిపోకపోవడంతో ఉదయం వరకు రోడ్లపక్కనే కూరగాయల మూటలు నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి. కొందరికి గోడౌన్లు ఉన్నప్పటికీ కూడా ఎక్కువ శాతం రోడ్లపైనే ఉదయం పూట వ్యాపారాలు సాగుతుంటాయి. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్ ప్రాంతంలో ఎక్కువగా కూరగాయల వ్యాపారం రోడ్లపక్కనే జరుగుతుంటాయి. తోపుడుబండ్లపై వీధుల్లో కూరగాయలు వ్యాపారం చేసేవారు కూడా తెల్లవారుజాము నుంచే తమ తోపుడుబండ్లను ఈ ప్రాంతాలకు తీసుకుని వస్తుంటారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లే వారు ఆటోల్లో ఎక్కువగా ఈ ప్రాంతాలకు వచ్చి ఉదయం పూట కూరగాయలు అమ్ముకుని వెళుతుంటారు. అంతేకాక పోరుమామిళ్ల గాంధీ సర్కిల్‌లో కాక ఆర్టీసీబస్టాండు, చుట్టుపక్కల కూడా ఈవ్యాపారాలు కొనసాగిస్తున్నా వారికి మాత్రం ప్రత్యేక రూములు కేటాయించకపోవడంతో అక్కడేవ్యాపారం చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్లలో రైతుబజారు ఏర్పాటు చేయడానికి హుసేన్‌పీర్ దర్గా ఎదురుగా ఉన్న రెవెన్యూ చావిడిలో స్థలం కేటాయించడం, బేస్‌మట్టం వరకు పనులు కూడా జరిగాయి. కానీ అప్పట్లో ఆ ప్రభుత్వం మారిపోవడంతో ఆ స్థానంలో ప్రస్తుతం గ్రామ సచివా లయం వెలిసింది. పోరుమామిళ్లలో రైతుబజారు ఏర్పాటు చేస్తే పోరుమామిళ్లవాసులే కాక చుట్టుపక్కల గ్రామాల వారికి ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ హయాంలో అయినా రైతు బజారు ఏర్పాటు చేయాలని కూరగాయల రైతులు కోరుతున్నారు.


పోరుమామిళ్లలో రోడ్డు పక్కనే కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్న దృశ్యం

9న మాదిగల మహాధర్నా

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29: ఎస్సీ వర్గీకరణకోసం ఆగస్టు 9వ తేదీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ మాదిగల మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.సుధాకర్‌మాదిగ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటమ్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ఖాజీపేట, జూలై 29: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని హెడ్మాస్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ జిల్లా తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి సారె రామానాయుడు విద్యార్థులకు తిథి భోజనం అందించారు. ఈ సందర్భంగా మాంసాహార భోజనం పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

కాశినాయన..: ప్రభుత్వ పాఠశాలల్లో తిథిభోజనం ఏర్పాటుచేయడం స్వాగతించాల్సిన విషయమని ఎంఈవో ఓ.నిర్మల పేర్కొన్నారు. సోమవారం ఆమె గొంటువారిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ బోవిళ్ల పిచ్చిరెడ్డి ఏర్పాటుచేసిన తిథిభోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలకు సంబందించిన పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీవారికి పలుసూచనలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.నారాయణరెడ్డి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం..: నర్సాపురం ఎమ్మార్సీలో సోమవారం ఎంఈవో నిర్మల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలంటూ వారికి సలహాలు అందజేశారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాణిక్యరాజు పేర్కొన్నారు. సోమవారం పాఠశాల విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎంఈవో సావిత్రమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవోనెం.1ని సమర్థవంతంగా అమలు చేసి పుస్తకాలు అందని పాఠశాలలకు వెంటనే సరఫరా చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనుల్లో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాగ్ కన్వీనర్ చరణ్, నగర కార్యదర్శి శివ, సోహెల్, శ్రావణ్, వెంకటేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరులకు కౌన్సెలింగ్

రాజుపాలెం, జూలై 29 : మండల ంలోని వివిధ గ్రామాల జూదర్లకు సోమవారం రాజుపాలెం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు జూదమాడుతుండగా కేసులు నమోదై ఉన్నాయి. అలాంటి వారు మళ్లీ ఈ వ్యసనాలకు పాల్పడకుండా గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని వారికి హెచ్చరించారు. ఇవే కాకుండా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వికలాంగులకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలి

బి.కోడూరు, జూలై 29 : బి.కోడూరు మండల పరిధిలో నివశిస్తున్న వికలాంగులకు ఇంటిస్థలాలు ఇవ్వాలని రాష్ట్ర వికలాంగుల అధ్యక్షుడు ఇండ్ల ఓబులేస్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 300 మందికి పైగా వికలాంగులు ఉన్నారని వారికి గత ప్రభుత్వంలో ఇంటిస్థలాలు ఇస్తామని మోసం చేశారన్నారు. అనంతరం డిప్యూటీతహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మురళి, సుబ్బారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్‌సేవలు ప్రారంభించాలి

ఖాజీపేట, జూలై 29: పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు ప్రారంభించాలని టీడీపీ మాజీ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం కదీరుల్లా అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట పోస్టాఫీసులో ఆధార్‌సేవలు ప్రారంభించమని, ప్రభుత్వం పరికరాలను అందించినా అధికారులు వాటిని పక్కనవేసి పట్టించుకోలేదన్నారు. బయట బోర్డులు మాత్రం ఆధార్‌సేవలు ఉన్నాయని ఆర్భాటాలు మటుకు చేస్తున్నారని వారు అన్నారు. ఆధార్‌కార్డుల సేవలు వినియోగించుకోవాలంటే చాలా మంది దూర ప్రాంతాలకు వెళ్లి వారి చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సేవలు అందించాలన్నారు.

56 సామాజిక పింఛన్లు తొలగింపు

కొండాపురం, జూలై 29: మండలంలో ఎన్టీఆర్ భరోసా కింద పంపిణీ చేసే 56 సామాజిక పింఛన్లు తొలగించినట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. చనిపోయిన వారిగా గుర్తించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి సదరం సర్టిఫికెట్లు పొంది నోటీసులు పొందిన దివ్యాంగులకు ఈ దఫా కూడా పింఛన్లు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.కాగా విచారణ తర్వాత ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు.ఆగస్టు 1న ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేస్తారన్నారు.మండలంలో మొత్తం 6438 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పులులపై అవగాహన సదస్సు

పోరుమామిళ్ల, జూలై 29 : జాతీయ జంతువు పులి గురించి స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జూనియర్‌కళాశాలలో ఫారెస్టురేంజర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం ప్రపంచ పులుల దినోత్సవ సందర్భంగా టేకూరుపేట బీట్ పరిధిలో అటవీ అధికారులు ఆ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించి పులులపై అవగాహన కల్పించి ప్రతిభ కనబరిచి ముగ్గురికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు రమణ, బీట్ ఆఫీసర్లు కరుణాకర్, కిశోర్, ప్రతాప్, శ్రీనివాసులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసరు నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయురాళ్లు రెడ్డమ్మ, భాగ్యలక్ష్మి, బేగం, నసీమాబేగం పాల్గొన్నారు.

పైపులు లీకేజీతో స్థానికుల ఇక్కట్లు



జమ్మలమడుగు, జూలై 29: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ శివార్లలో కాలువ పక్కన రోడ్డుపై మంచినీటి పైపులు లీకేజీ అయ్యాయి. గత ఏడాది నుంచి ఈ సమస్య ఉన్నప్పటికీ స్థానికులు అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. పైపులు లీకేజీ వలన మంచినీరు కలుషితం అవుతున్నాయని లీకేజీలు మూడు నుంచి నాలుగు చోట్ల ఉన్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

జాతీయ కుష్టు నిర్మూలనపై అవగాహన సదస్సు

బి.కోడూరు, జూలై 29 : మండలపరిధిలోని గోవిందాయపల్లె జిల్లా పరిషత్ హైస్కూలులో వైద్యాధికారి వినీత్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు అలాగే చేతిలో నుండి వస్తువులు జారిపోవడం,కాళ్ల నుండి చెప్పులు జారడం, ముక్కు తిప్పడం, కంటి నరాలు దెబ్బతిని కంటి చూపు కోల్పోవడం, అరిచేతిలో వేడి, చల్లని వస్తువులను స్పర్శ తెలియకపోవడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎన్ఎంలు కుమారి, మల్లిక, ఆశా కార్యకర్తలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు : ఏపీడీ

వడ్డమాను కత్తెరగండ్ల ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్లపై విచారణ



కాశినాయన,జూలై29: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని బద్వేల్ ఏపీడీ ఆనంద్ పేర్కొన్నారు.సోమవారం కత్తెరగండ్ల ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ పి.గురప్ప,వడ్డమాను ఫీల్డ్‌అసిస్టెంట్ బ్రహ్మానందరెడ్డిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఇటీవల ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు విధినిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాసమస్యల పరిష్కారవేదికలో పలువురు స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈవిషయంపై విచారణచేపట్టినట్లు ఏపీడీ తెలిపారు. ఈయన వెంట ఏపీవో జయరాముడు పాల్గొన్నారు.

నల్లాయపల్లె భూములకు రక్షణ లేదు


తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అట్లూరు, జూలై 29 : అట్లూరు మండలంలోని నల్లాయపల్లె భూములకు రక్షణ లేదంటూ మండల ముంపువాసులు నల్లాయపల్లె భూపట్టాదారుల తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. బద్వేలు మండలానికి చెందిన వైసీపీ నాయకులు తమకు ఇచ్చిన పట్టాల భూములను రెండు నెలలుగా ట్రాక్టర్లు , ఎక్స్‌కవేటర్లు పెట్టి పగలు రాత్రి దున్నుకుంటూ కంచెలు వేశారన్నారు. మొక్కలను నాటి మా భూములను కబ్జా చేస్తుంటే ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. భూకబ్జాలను అరికట్టకపోతే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని జాతీయ బీసీ చైతన్య సమితి నేత బీసీ రమణ హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు.

రేపటి నుంచి ఉరుసు

పోరుమామిళ్ల, జూలై 29 : పోరుమామిళ్లలోని హజరత్ హుస్సేన్ పీర్ దర్గాలో ఈ నెల 31 నుంచి ఉరుసు వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 31న గంధం, 1న ఉరుసు, 2న తహలీల్ ఉంటుం దన్నారు. గొప్ప ఖవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే మహాత్మాగాంధీ విగ్రహంసమీపంలో ఉన్న హజరత్ గంజాసాహెబ్ దర్గాలో 1వతేదీ గంధం, 2న ఉరుసు, 3న తహలీల్ కార్యక్రమం ఉంటుందని అంజుమన్ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

పోష్ యాక్ట్ పై ఉద్యోగినులకు అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు , జూలై 29 : పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోష్ చట్టం క్రింద కఠినంగా శిక్షిస్తుందని నోడల్ ఆఫీసర్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పోష్ చట్టం పై ఉద్యోగినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పది మంది ఉద్యోగులున్న ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలపట్ల పురుషులు లైంగిక వేధింపులకు పాల్పడితే అక్కడ వున్న లోకల్ కమిటీకి ఫిర్యాదు చేస్తే వారిని విచారించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో షైమావతి మాట్లాడుతూ పోష్ చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లు, ఆసుపత్రులు వ్యాపార సముదాయాలు, మాల్స్‌లలో పనిచేసే వారికి ఈ చట్టంపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి కళ ,ఎంఈవో సావిత్రి, ఎస్ఐ షైమావతి,మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరి సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ శాఖ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

చాపాడు..: పురుషులు ఎవరైనా చిన్నారులు, మహిళలపట్ల లైంగింక వేధింపులకు పాల్పడితే సంబంధిత అధికారులు పోష్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సీడీపీవో సావిత్రి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ వేధింపులకు గురైనవారు తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో ఫిర్యాదులు వేయాలన్నారు. అధికారులు ఆ ఫిర్యాదులను విచారించి 90 రోజుల్లో పరిష్కారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంతుల్లా, ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ,సూపర్‌వైజర్లు సుబ్బరత్న, రాజ్యలక్ష్మి, మహిళా పోలీసులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముద్దనూరు జూలై29:స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.ఉదయం 10-30 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

పొలం గట్టు విషయమై ఘర్షణ

మైలవరం, జూలై 29 : మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన రెడ్డిపల్లి శ్రీరాములు, బోపతి పుల్లారెడ్డి మధ్య పొలం గట్టు విషయమై మాటా మాటా పెరిగి ఘర్షణకు పాల్పడినట్లు తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు సోమవారం తెలిపారు.రెడ్డిపల్లి శ్రీరాములు భూమి సాగు చేస్తుండగా దాని పక్కనే పుల్లారెడ్డికి చెందిన పట్టా భూమి ఉండటంతో ఇద్దరి గట్ల మధ్యమట్టి పోసే విషయంలో ఘర్షణ జరగడంతో పుల్లారెడ్డి తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లంపీ,ముద్ద చర్మ వ్యాధి టీకాలు

ముద్దనూరు జూలై29:మండల పరిధి కొత్తపల్లి పశువైద్యశాల వద్ద ఆవులు, ఎద్దులకు లంపీ ,ముద్ద చర్మ వ్యాధి టీకాలు వేసినట్లు ఏరియా పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకుడు వాసశ్రీనివాస తెలిపారు,పశువుల్లో వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల జ్వరము, కళ్ళ నుంచి నీరు కారడం, చర్మం ఇతర భాగాలపై నాడ్యూల్స్ కల్గి ఉండటం లంపీ ,ముద్ద చర్మ లక్షణాలన్నారు.

పెద్దదుద్యాల గ్రామస్థుల నిరసనకు టీడీపీ మహిళలు మద్దతు



ముద్దనూరు జూలై29: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి.గ్రామస్థులకు టీడీపీ మహిళా విభాగం సంఘీ భావం తెలిపింది.అందులో భాగంగా కడప నగర టీడీపీ వాణిజ్య మహిళా విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి ,టీడీపీ నాయకురాళ్లు రెడ్డెమ్మ, తులశమ్మ, గోవిందమ్మ మద్దతుగా కూర్చున్నారు. ప్రజల ప్రాణానికి హానికల్గించే ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో నాణ్యతలేని భోజనం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29: ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ జి.నాగరాజు విమర్శించారు. సోమవారం ఆయన హాస్టల్‌లో విద్యార్థులకు మధ్యాహ్నం వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నంలో రాళ్లు ఉన్నాయని, మెనూను అనుసరించడంలేదని, ఉదయం పాలు ఇవ్వడంలేదని, టిఫెన్ కూడా సక్రమంగా ఉండడంలేదన్నారు. దీనిపై హాస్టల్‌వార్డెన్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం పునఃప్రారంభించాలి



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసి విద్యార్థుల కడుపుకొట్టిందని విమర్శించారు. మధ్యాహ్న భోజనం అమలు చేయడం వలన కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు రియాజ్, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

బద్వేలు, జూలై 29 : విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవమని ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సోమవారం బద్వేలు పట్టణంలోని బాబా విద్యామందిర్ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తామందరం ఒకచోట కలుసుకునేందుకు వేదిక అయిన పాఠశాలలో పాఠశాల అధినేత బసెట్టి రామయ్య మృతికి కాసేపు మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులను జ్ఞాపిక, శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తుచేసు కుంటూ నిక్ నేమ్‌లతో పిలుచుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కృష్ణ గౌతమి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

బియ్యం బస్తాల తూకంలో తేడాలు

అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 29 : ప్రభుత్వ గోదా ములనుంచి డీలర్లకు పంపిణీ చేసే బియ్యం బస్తాలు తూకంలో తేడాలు వస్తున్నాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గోదాము అధికారులను ప్రశ్నించారు. సోమవారం జమ్మల మడుగు రోడ్డులోగల ప్రభుత్వ గోదాముల్లో గల బియ్యం బస్తాలను ఎమ్మెల్యే డీలర్లతో కలిసి పరిశీలించారు. బియ్యం బస్తాల్లో తూకం తక్కువ వుండటం పై గోదాము డిప్యూటీ తహసీల్దారును ప్రశ్నించారు. జిల్లా గోదాముల అధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. తూకం వేయకుండా బియ్యం బస్తాలు డీలర్లకు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. అసలు కాటానే లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రొద్దుటూరు టౌన్, జూలై 29: జాతీయస్థాయి 12వ ఓపెన్ ఆల్‌స్టైల్స్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాదులో బ్రూస్లీ జీత్‌కునేడో స్పోర్ట్స్ ఆల్‌టైప్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికలకు ఫైటింగ్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన జునైద్, అబ్దుల్‌జావిద్, నరసింహ, నాగలహరి బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ సోహెల్ తెలిపారు.

ప్రారంభానికి ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్


చకచకా జరుగుతున్న అన్న క్యాంటీన్ పనులు

మైదుకూరు రూరల్ జూలై 29 : మైదుకూరులోని జీపు స్టాండ్ సమీపంలో అన్నక్యాంటీన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభానికి కాంట్రాక్టర్లు పనులు చకచకా చేయిస్తున్నారు.2019లో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు జరుగుతూ మధ్యలో ఎన్నికలు రావడంతో అధికారం చేపట్టిన వైసీపీ ఆపనులను పట్టించుకోక పోవడంతో ఆగిపోయాయి. మళ్లీ కూటమికి అధికారం రావడంతో ఆగిపోయిన పనులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవతో పుంజుకున్నాయి. క్యాంటీన్ పనులు పూర్తి అయితే ఐదు రూపాయలకే పేదలకు అన్నం అభిస్తుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరిలో కాలి బాటలు రైతులకు ఎంతో లాభదాయకం

ఏవో ప్రవీణ్‌కుమార్

కాశినాయన జూలై 29: వరిలో కాలి బాటల ఏర్పాటు రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఏవో ప్రవీణ్‌కుమార్,వీఏఏ వరకుమార్ పేర్కొన్నారు. సోమవారం వారు నర్సాపురం,ఓబుళాపురం తదితర గ్రామాల్లో నారుమడులను, ప్రస్తుతం నాట్లు జరుతున్న పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ నారు కొనలను తుంచి నాటుకోవాలని పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ వెడల్పుతో కాలి బాటలు(సందు) వదులుకోవాలని సూచించారు. ఇలా నాటడంవల్ల పైరుకు సూర్యరశ్మి బాగా తగులుతుందని సుడిదోమ ఉధృతిని నివారించవచ్చునన్నారు.